క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

ఆగిరిపల్లి: వైఎస్సార్ సీపీ ఆగిరిపల్లి మండల కార్యకర్తల సమావేశం సోమవారం జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు తెలిపారు. ఆగిరిపల్లిలోని పామర్తి నాగేశ్వరరావు ఇంటి ఆవరణలో సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొంటారన్నారు.

సీసీ రోడ్డు వేశారు.. మార్జిన్‌లు మరిచారు



నూజివీడు: పట్టణంలోని విస్సన్నపేట రోడ్డులో సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తయ్యి దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు రోడ్డుకు ఇరువైపులా మార్జిన్‌లలో మట్టిపోయకుండా వదిలేయడంపై స్థానికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.80 లక్షల వ్యయంతో 200 మీటర్లు పొడవు, 10 మీటర్ల వెడల్పుతో సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఈ రహదారికి ఇంతవరకు మార్జిన్‌లలో మట్టిపోయకుండా వదిలేశారు. దీంతో స్థానికులు తమ వీధుల్లోకి, గృహాల్లోకి, దుకాణాల్లోకి రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ద్విచక్రవాహనాలు, ఆటోలు తప్పుకోవడానికి వీలులేక ఇబ్బందులు పడుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: పుల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బాడవ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ గార్లపాటి రమేష్ బాబు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని బాడవ, కొత్తగూడెం, కొత్త మంగాపురం గ్రామాలలో ఉదయం 7నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో సోమవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ వీరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

- కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో కొండపల్లిలో సోమవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పవిత్రరాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డంపింగ్ యార్డ్, మున్సిపల్ కార్యాలయం రోడ్డు, వంగవీటి వీధి, కుమ్మరిబజార్, ఖిల్లారోడ్డు డౌన్, మార్కెట్ ఏరియా, వినాయకుడి ఆలయం, లలిత నగర్, ఆరుపంపుల సెంటర్, పోస్టాఫీస్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.
- నూజివీడు: పట్టణ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ. సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీలో విద్యుత్ లైన్ల మరమ్మత్తుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

నందిగామరూరల్: రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని గరికపాడు కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త లక్ష్మీకళ పేర్కొన్నారు. వికసిత్ సంకల్ప్ కృషి అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పల్లగిరి, కొండూరు, రామిరెడ్డి గ్రామాల్లో రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆధునిక యాంత్రీకరణపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ముఖ్యంగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించటం వల్ల దిగుబడులు తగ్గటంతో పాటు సాగు ఖర్చులు అధికంగా ఉంటాయని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా సాగు ఖర్చులు తగ్గటంతో పాటు ఆహార ధాన్యాలపై రసాయనాల ప్రభావం ఉండదన్నారు. రైతులు విధిగా మట్టి పరీక్షలు చేయించి లోపాలను గుర్తించి అందుకనుగుణంగా మందులను వినియోగించాలని తెలిపారు. అంతే కాకుండా కొత్తరకం ఉద్యాన పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జశ్వంత్ రెడ్డి, రాజప్ప, కేవీకే కోఆర్డినేటర్ అచ్యుతరాజు, ఏడీఏ శ్రీనివాస్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై నిరంతరం నిఘా

నందిగామటౌన్: రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంటుందని, అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని సీఐ వైవీఎల్ నాయుడు అన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు తీరు మార్చుకుని, సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. సత్ప్రవర్తనతో మెలిగే వారి రౌడీషీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. అనంతరం వివాదాలు, ఘర్షణలకు దూరంగా ఉంటామని ప్రమాణం చేయించారు.

మురుగుతో ముప్పు



కొండపల్లి వడ్డే నగర్‌లో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు



డ్రెయినేజీల్లో పొంగి పొర్లిన మురుగునీరు

- ఇళ్ల మధ్య వారాల తరబడి మురుగు నీరు నిల్వ
- దుర్వాసన, దోమల విజృంభణ
- పందుల సంచారంతో వ్యాధుల భయం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వర్షాలు కురుస్తుండటంతో కొండపల్లి మునిసిపాలిటీలో ఇళ్ల మధ్య, రోడ్లపై వాడుక నీరు, వర్షం నీరు నిలిచిపోతోంది. వారాల తరబడి వర్షం నీరు నిల్వ ఉండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వడ్డేనగర్, గాయత్రి నగర్, శామిక నగర్ తదితర ప్రాంతాల్లో మురుగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఓ వైపు దుర్వాసన, మరో వైపు దోమల బెడదతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఖాళీ స్థలాల్లో వర్షం నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపైకి నీరు చేరి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. పందులు సంచారంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది.

దోమల ఉత్పత్తి కేంద్రాలుగా..

కొండపల్లి వడ్డేనగర్, శ్రామికనగర్, గాయత్రి నగర్ ప్రాంతాలకు ఎగువున ఉన్న కొండ ప్రాంతాల నుంచి వర్షాలు పడిన సమయాల్లో అధికంగా నీరు వచ్చి చేరుతోంది. ఆయా ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం, వాడుక నీరు పారుదల లేదు. దీంతో వారాల తరబడి రోడ్లపై మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగునీటి గుంతలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. రోడ్లపై నిలిచిన మురుగుతో రాకపోకలు సాగించడం ఇబ్బందిగా ఉంది.

వ్యాధులు ప్రబలే అవకాశం

నివాసాల మధ్య మురుగునీటి నిల్వలతో అపరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతోంది. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వృద్ధులు, చిన్నారులు వైరల్ జ్వరాల బారిన పడతారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే దోమలు పెరిగాయని, దోమకాటుతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీటిలో బ్యాక్టీరియా వృద్ధి చెంది కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు అవుతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పందుల సంచారంతో మెదడువాపు వ్యాధి వచ్చే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి నివాసాల మధ్య మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

మురుగునీరు తొలగించాలి



వర్షాలు కురుస్తుండటంతో నివాసాల మధ్య మురుగునీరు వచ్చి చేరింది. ముఖ్యంగా వడ్డే నగర్‌లో రోడ్లపై రెండు వారాలుగా నీరు నిలిచి ఉంది. ప్రజల రాకపోకలకు ఆటంకంగా మారింది. డ్రెయిన్లు పొంగిపొర్లుతున్నాయి. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్లపై నిలిచిన మురుగునీరు తొలగించాలి.

–చందా చంటి, వార్డు మాజీ సభ్యుడు, కొండపల్లి

మురుగుతో సహవాసం



వడ్డే నగర్‌లో మురుగు నీటితో సహవాసం చేస్తున్నాం. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తాయని భయమేస్తోంది. మురుగు నీరు తొలగించాలని అధికారులను కోరినా స్పందించడం లేదు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తక్షణం తగిన చర్యలు తీసుకోవాలి.

– నత్త వాణి, స్థానికురాలు, వడ్డేనగర్

పోలీసులకు యోగా అవసరం



నూజివీడు: నిత్యం ఒత్తిడికి లోనయ్యే పోలీస్ అధికారులకు, సిబ్బందికి యోగా ఎంతో అవసరమని నూజివీడు రూరల్ ఎస్ఐ జి. జ్యోతిబసు అన్నారు. పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం యోగా సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యోగా సాధన ద్వారా మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఉరుకుల పరుగుల జీవనంలో ఎదురయ్యే ఒత్తిడుల నుంచి బయటపడాలంటే ప్రతి రోజూ ఉదయం గంట సేపు యోగాసనాలను అభ్యసించాలన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలు స్వీకరించి గడువులోగా సమస్యలకు నాణ్యమైన పరిష్కారాన్ని చూపిస్తామన్నారు.

పనిచేయని సర్వర్లు.. కార్డుదారుల ఇక్కట్లు



రెడ్డిగూడెం రేషన్ షాపు వద్ద ఎండలో నిలుచున్న కార్డుదారులు



రేషన్ తీసుకునేందుకు లబ్ధిదారులు లేక వెలవెలబోతున్న మైలవరం రాజాపేటలోని రేషన్‌షాపు

జి.కొండూరు: ఇంటింటికి రేషన్ పంపిణీ వ్యవస్థను తొలగించిన కూటమి ప్రభుత్వం రేషన్ షాపుల వద్దకే వచ్చి రేషన్ తీసుకోవాలనే నిబంధన తీసుకురావడంతో ప్రజలకు పాత రోజుల కష్టాలు గుర్తుకొస్తున్నాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి రేషన్ పంపిణీ నూతన పాలసీని అమలు చేయడంతో ఆదివారం రేషన్ షాపుల వద్దనే రేషన్ పంపిణీని ప్రారంభించారు. పలుచోట్ల కూటమి నాయకులు ఆర్భాటంగా రిబ్బన్ కటింగ్‌లు చేసి మరీ ప్రారంభించారు. అయితే ఇంటి వద్దకే రేషన్ పంపిణీ అనేది ప్రజలకు సౌలభ్యంతో పాటు ఆత్మగౌరవ అంశంగా భావించిన లబ్ధిదారులు, ఇప్పుడు రేషన్ షాపుల వద్దకు రావడానికి సుముఖత వ్యక్తం చేయడం లేదు. దీనికి తోడు సర్వర్ సమస్య కూడా ఉండటంతో జి.కొండూరు, రెడ్డిగూడెం మండలాల్లో రేషన్ పంపిణీ మొదటి రోజు పది శాతం కూడా జరగలేదని తెలుస్తోంది. జి.కొండూరు మండల పరిధిలో 38 రేషన్ షాపులు ఉండగా 19,703 రేషన్ కార్డులు ఉన్నాయి. అదేవిధంగా రెడ్డిగూడెం మండల పరిధిలో 29 రేషన్ షాపులు ఉండగా 15,561 రేషన్ కార్డులు ఉన్నాయి.

రెడ్డిగూడెంలో కార్డుదారుల అవస్థలు..

మైలవరం: రెడ్డిగూడెంలో రేషన్ తీసుకునేందుకు పేదలు ఇబ్బందులు పడ్డారు. వేలి ముద్రలు పడలేదని, సర్వర్ డౌన్ అయిందని రేషన్ డీలర్లు చెప్పడంతో పలువురు ఎండలోనే పడిగాపులు పడ్డారు. మరి కొందరు ఇళ్లకు వెళ్లిపోయారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ పంపిణీ జరిగేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో రేషన్ వినియోగదారులకు తిప్పలు తప్పడం లేదని వాపోయారు. వాహనాలు రద్దు చేయడం కక్షపూరిత చర్యగా పేర్కొన్నారు.



నరసింహారావుపాలెం రేషన్ షాపు వద్ద వేలి ముద్రలు వేస్తున్న మహిళలు

రేషన్‌కు ఇక్కట్లు

చాట్రాయి: ఇంటింటికి రేషన్ పంపిణీ వ్యవస్థను రద్దు చేసి రేషన్ షాపుల వద్దనే సరుకుల పంపిణీ ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం తాజాగా రేషన్ షాపుల వద్ద పంపిణీ చేయడంతో దూరం నుంచి షాపునకు వచ్చి సరుకులు తీసుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. షాపు నుంచి రెండు కిలో మీటర్ల దూరం గ్రామాల వారు బియ్యాన్ని మోసుకెళ్లలేక అవస్థలు పడ్డారు. మండలంలోని నరసింహారావుపాలెం రేషన్ షాపు నుంచి పిట్లవారిగూడెం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరం.. చీపురుగూడెం నుంచి శివారు గ్రామాలు మర్రిబంధం, చాట్రాయి నుంచి గొల్లగూడెం, సూరంపాలెం నుంచి కరుణాపురం గ్రామాలు దూరంగా ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు సరుకులు తీసుకెళ్లాలంటే ప్రయాస పడాల్సి వస్తోందని చెబుతున్నారు. కొన్ని షాపుల్లో సర్వర్లు పనిచేయక ఎదురు చూడాల్సి వచ్చింది. 65 ఏళ్లు ఉన్న కార్డుదారుల కుటుంబాలకు డోర్ డెలివరీ చేస్తామన్న ప్రభుత్వం పంపిణీ చేయలేక చేతులెత్తేసిందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

దుకాణాల్లో రేషన్ పంపిణీ ప్రారంభం

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని చౌకధరల దుకాణాల్లో నిత్యావసర సరుకుల పంపిణీని ఆదివారం ప్రారంభించారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానాన్ని రద్దు చేసిన టీడీపీ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారానే సరుకులు తీసుకోవాలని ఆదేశించింది. స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పలు దుకాణాలను ప్రారంభించారు.

- నూజివీడు: పట్టణంలోని 17వ రేషన్ దుకాణం వద్ద సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆదివారం రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభించి మాట్లాడారు. తహసీల్దార్ గుగులోతు భద్రు, సివిల్ సప్లయిస్ డీటీ జి. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.
- విస్సన్నపేట: స్థానిక 3,4 రేషన్ షాపుల వద్ద ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు రేషన్ సరుకులు పంపిణీని ఆదివారం ప్రారంభించారు. తహసీల్దార్ కె లక్ష్మీకల్యాణి పాల్గొన్నారు.

4న వెన్నుపోటు దినం.. విజయవంతం చేద్దాం

మాజీ మంత్రి జోగి రమేష్ పిలుపు



ఇబ్రహీంపట్నంలో వెన్నుపోటు దినం వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జోగి రమేష్, నాయకులు

ఇబ్రహీంపట్నం: మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో హామీల అమలులో విఫలమైందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపు ఇచ్చారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపుమేరకు ఈనెల 4న నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమం విజయవంతంపై ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం ఇబ్రహీంపట్నంలో ఆదివారం జరిగింది. జోగి రమేష్ మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఇచ్చిన హామీల మేరకు జగనన్న బటన్ నొక్కి బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు బటన్‌లు ఎందుకు నొక్కడం లేదని ప్రశ్నించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటే బాగుండేదనే అభిప్రాయం అన్ని వర్గాల ప్రజల్లో బలంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా వెన్నుపోటు దినం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వేములకొండ తిరుపతిరావు, సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధర రావు, వివిధ మండలాల పార్టీ కన్వీనర్లు రెంటపల్లి నాగరాజు, గర్నేపూడి వెంకటరావు, జడ రాంబాబు, బయ్యారపు కిశోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిక్కిలి శరభయ్య, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు, ముఖ్య నాయకులు నల్లమోతు దయాకర్, కుంచం జయరాజు, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి, జి.రాణి, పోరంకి శ్రీనివాసరాజు, బి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ధ్వని కాలుష్యంపై అవగాహన



మైలవరంలో ధ్వని కాలుష్యాన్ని వివరిస్తున్న ఉపాధ్యాయిని తులసి



నూజివీడు గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

మైలవరం: ధ్వని కాలుష్యానికి గురైన వారు వినికిడి సామర్థ్యాన్ని కోల్పోతారని మైలవరం ఎంబీఎం జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయిని ఎం. తులసి అన్నారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మైలవరం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ధ్వని కాలుష్యంపై అవగాహన కల్పించారు. తులసి మాట్లాడుతూ వారానికి 40 గంటలు 90 డీబీ తీవ్రత గల ధ్వని కాలుష్యానికి గురైతే వినికిడి సామర్థ్యం కోల్పోతారని వివరించారు. అనంతరం జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనం

నూజివీడు: పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తోన్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు పుస్తకపఠనం అనంతరం పిల్లలతో పుస్తక సమీక్ష నిర్వహించారు. పిల్లలు చదివిన విజ్ఞాన పుస్తకాల్లోని పలు అంశాలపై ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. వేసవి సెలవుల్లోనే కాకుండా ఏడాది పొడవునా పాఠశాల సెలవు రోజుల్లో గ్రంథాలయానికి వచ్చి విజ్ఞాన పుస్తకాలు, వార్తాపత్రికలు, కథల పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని పిల్లలకు ఆయన సూచించారు.

బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎంలు

తిరువూరు: మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బదిలీ అయ్యారు. గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు షేక్ బాబా సాహెబ్, మునుకుళ్ల జెడ్పీ హైస్కూల్‌కు జక్కేపల్లి మురళీకృష్ణ, ముష్టికుంట్లకు బెల్లంకొండ వీరభద్రరావు ప్రధానోపాధ్యాయులుగా నియమితులయ్యారు. ఆదివారం వీరు బాధ్యతలు స్వీకరించారు.

- చాట్రాయి: మండలంలోని జెడ్పీ హైస్కూళ్లకు నూతనంగా ప్రధానోపాధ్యాయులు ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. చిన్నంపేట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా ఎ.లక్ష్మీ, సి.గుడిపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా బక్కయ్య, చిత్తపూరు జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎంగా జి.సౌభాగ్యం పదవీ బాధ్యతలు చేపట్టారు.
- మునునూరు: ప్రమోషన్లు, బదిలీల్లో భాగంగా మండలంలోని పలు జెడ్పీ హైస్కూళ్లకు నూతన హెచ్‌ఎంలు బాధ్యతలు చేపట్టారని డీవైఈఓ సేవియా నాయక్ తెలిపారు. ఆగిరిపల్లి హైస్కూల్ నుంచి చెక్కపల్లి జెడ్పీ హైస్కూలుకు షేక్ అల్లాబక్షు, నూజివీడు ఆర్ఆర్ పేట యూపీ స్కూల్ నుంచి మునునూరు హైస్కూలుకు డి.శైలజ, ఎస్ఆర్ఆర్ బాలుర హైస్కూల్ నుంచి గుడిపాడు హైస్కూల్‌కు నాగబాబు, మచిలీపట్నం సుల్తాన్‌నగర్ నుంచి కాట్రేనిపాడు హైస్కూల్‌కు కె.కుసుమకుమారి ప్రమోషన్లపై నూతన హెచ్‌ఎంలుగా బాధ్యతలు చేపట్టారు. వేల్పుచర్ల హైస్కూల్ హెచ్‌ఎంగా ఐఎల్‌వీ సుబ్రహ్మణ్యం బాధ్యతలు స్వీకరించారు.

- జగ్గయ్యపేటఅర్బన్: పట్టణ సమీపంలోని విశాఖపట్నం లైమ్ స్టోన్ మైన్స్ క్వార్టర్స్ ప్రాంగణంలో ఉన్న శ్రీభూసమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామి వారికి మల్లె పూలతో ప్రత్యేక అలంకారం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం వీఏస్పీ పూర్వ ఉద్యోగి పీఆర్కే రాజు, హేమలత దంపతుల ఆర్థిక సహాయంతో స్వామి వారికి మల్లెపూలతో ప్రత్యేక అలంకారాన్ని, పూజలను నిర్వహించారు. ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పట్టణంలోని హెడ్ పోస్టాఫీసు వద్ద పేరుకుపోయిన చెత్త



సూరి రామమందిరం వద్ద చెత్తచెదారం



చెత్తమయం.. స్వచ్ఛత శూన్యం

నూజివీడు మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో, వార్డుల్లో చెత్త పేరుకుపోయింది. పట్టణంలోని వీధులు చెత్తచెదారంతో దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారుల వెంట చెత్త తొలగించకపోవడంతో అపరిశుభ్రత నెలకొంది. ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రచారార్భాటంతో ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించడం తప్పితే వాస్తవంగా ఆచరణలో పారిశుద్ధ్య నిర్వహణ ఏ మాత్రం మెరుగుపడటం లేదు. మున్సిపాలిటీలో రోజుకు 28 నుంచి 30 టన్నుల చెత్త వస్తుండగా ఆదివారం వస్తే అందులో సగం చెత్తను రోడ్ల వెంట వదిలివేస్తున్నారు. దీంతో దోమలు, ఈగలు పెద్ద ఎత్తున వృద్ధి చెందుతున్నాయి. వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

– నూజివీడు



ఎన్నెస్పీ గేటు వద్ద మెయిన్ రోడ్డు వెంట చెత్త డంప్



అమ్మవారితోట ప్రాంతంలో రోడ్డుపై చెత్త